క్లుప్తంగా

ఈ-పంట నమోదు పరిశీలన


ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని కాశీపేటలో ఈ-పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

ఎస్ఈబీ సీఐగా పద్మావతి


పద్మావతి, ఎస్ఈబీ సీఐ

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం ఎస్ఈబీ సీఐగా డి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇక్కడ సీఐగా సేవలందించిన శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పార్వతీపురం ఎస్ఈబీలో ఎస్ఐగా పనిచేసిన డి.పద్మావతి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నతాధికారుల సూచలతో విధులు నిర్వహిస్తానని, సర్కిల్ పరిధిలోని ప్రజలు సహకరించాలని కోరారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: అందరి సహకారంతో పార్వతీపురం మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి కౌన్సిలర్లు తీసుకొచ్చారు. అన్ని అభివృద్ధి పనులు దశలవారీగా చేపడుతామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

618 లీటర్ల మద్యం ధ్వంసం


సారా, మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బలిజిపేట: మండలంలో ఇటీవల కాలంలో పట్టుబడిన మద్యం సీసాలు, సారాను పార్వతీపురం ఏఎస్పీ సురాన అంకిత మహావీర్ పర్యవేక్షణలో సోమవారం ధ్వంసం చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో 44 కేసుల్లో పట్టుబడ్డ 618 లీటర్ల మద్యం సీసాలు, 40 లీటర్ల సారాను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు, పలు అభివృద్ధి పనులపై సభ్యులు తీర్మానాలు చేశారు. సమావేశంలో పలువురు అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా సురేష్


బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సురేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఒడిశా రాష్ట్రం సరిహద్దు ఉండడంతో సారా రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణకు కృషి చేస్తామన్నారు. సారా రవాణా, అమ్మకాలు చేపడితే ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

గేటుపడితే అరగంట ఆగాల్సిందే..

- బెలగాం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ పరిస్థితి
- పాఠశాలలు, ఆస్పత్రులకు వెళ్లాలంటే తప్పని నిరీక్షణ
- అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్న పట్టణవాసులు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం జిల్లా కేంద్రంగా ఏర్పడంతో జనసాంద్రత పెరిగింది. దీనికి అనుగుణంగా వాహనాల సంఖ్య కూడా పెరగడంతో నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. పార్వతీపురం పట్టణంలోని బెలగాం రైల్వే గేటు మీదుగా బెలగాం, బాలగుడబ, పెదగుడబ, చినగుడబ, వల్లరిగుడబ తదితర 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గేటు పడిన సమయంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. దీంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల మూడో లైన్ కూడా వేయడంతో రైళ్ల రద్దీ మరింత పెరిగింది. నిత్యం వేలాదిమంది ప్రజలు, ఉద్యోగులు కార్యాలయాలకు, వివిధ పనుల నిమిత్తం ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేటప్పుడు గేటు పడిందంటే వారు ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులన్నీ గేటుకు అటుపైపు ఉండడంతో బెలగాం వాసులతో పాటు 25 గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సరైన సమయంలో చికిత్స అందని పరిస్థితి

ట్రాఫిక్ జామ్ వల్ల రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే చాకలి బెలగాంలో విద్యార్థుల ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ వలన సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేమని భయపడి విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అండర్ పాస్ బ్రిడ్జి గానీ ఫ్లైఓవర్ గానీ నిర్మించాలని కోరుతున్నారు. అమృత్ భారత్ ప్రాజెక్టుకు పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఎంపికయ్యింది. ప్రస్తుతం ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నారు. అందులో భాగంగా పట్టణ బైపాస్ రోడ్డు నుంచి పార్వతీపురం (బెలగాం) స్టేషన్‌కు అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఇది ఇంకా వినియోగానికి రాలేదు. ఇది బెలగాం గేటుకు కిలోమీటరు దూరంలో ఉంది. కలెక్టర్, ఎస్పీ ఇలా అనేక కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే ఇక్కడ నుంచి అర కిలోమీటరు దూరం మాత్రమే ఉంటుంది. కొత్తగా వేసిన ఈ అండర్ బ్రిడ్జి నుంచి వెళితే దూరం పెరుగుతుంది.


రైల్వే గేటు వేయడంలో వేచి చూస్తున్న వాహనచోదకులు

ట్రాఫిక్ అవస్థలు



ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో గేటు పడితే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. చాలా సమయం వేచి ఉండాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల మీద పట్టణంలోకి వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అండర్ పాస్ బ్రిడ్జి గానీ, ఫ్లై ఓవర్ గానీ నిర్మించాలి.

– ఆర్‌వీఎస్ కుమార్, పార్వతీపురం

ఇబ్బందులు పడుతున్నాం



బెలగాం వద్ద రైల్వే గేటు పడితే అరగంట వరకూ వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్, ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నాం. అత్యవసర వైద్య సేవల నిమిత్తం రోగులను తరలించే అంబులెన్సు సైతం అరగంట పాటు నిలిచిపోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే అండర్ బ్రిడ్జిని నిర్మించాలి.

– ఈవీ నాయుడు, పార్వతీపురం

టీడీపీ నాయకులే ప్రజాప్రతినిధులా?


మాట్లాడుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సాలూరు రూరల్: గ్రామాల్లో ప్రజలు ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా టీడీపీ నాయకులే గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, అలాగే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు కార్యకర్తల చేతుల మీదుగా అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు అసలు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు. అధికారులు టీడీపీ కార్యకర్తలనే ప్రజాప్రతినిధులుగా భావిస్తున్నట్లు ఉందన్నారు. ఇలాగే కొనసాగితే ప్రభుత్వ తీరుపై ఆందోళన చేయాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ కె.త్రినాథ, సర్పంచ్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం ప్రారంభం

సీతానగరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు కలిసి పునఃప్రారంభించారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఈ కేంద్రాలకు తరలించి ఇక్కడ వాటిని కంపోస్టుగా మార్చుతారు. ఉత్పత్తి అయిన కంపోస్టును రైతులకు విక్రయిస్తారు. తద్వారా పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుంది. కంపోస్టును పంటలకు వినియోగించడం ద్వారా దిగుబడి పెరుగడంతో పాటు రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. మండలంలోని కొత్తవలస, కృష్ణారాయపురం, చెల్లంనాయుడువలస, కాశీపేట, లచ్చయ్యపేట, పెదబోగిలి, మరిపివలస తదితర గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వసతుల పరిశీలన


వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి విజయకళ్యాణి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బీసీ వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి సోమవారం సందర్శించారు. వసతి గృహంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా ఆరాతీశారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలు అవుతున్నదీ లేనిది పరిశీలించారు. విద్యార్థులకు వైద్య సేవలు అందించేందుకు వసతిగృహానికి వైద్య సిబ్బంది వస్తున్నారా లేదా అని అడిగి తెలుసున్నారు. ఆమె వెంట అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి అప్పన్న, వార్డెన్ సుభద్ర, తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బీవీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, పథకాలలో లక్షలాది మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ పద్ధతుల్లో పనిచేస్తున్నారని వీరికి మినిమం టైమ్ స్కేల్, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుని చట్ట ప్రకారం చెల్లించాల్సిన జీతాలు, ఇతర హక్కులు కల్పించడం లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకుండా ఉద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఆప్కాస్ విధానాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చిన తర్వాత ఈ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు అమ్మఒడి, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ వంటి పద్ధతుల్లో పనిచేస్తున్న అందరిని రెగ్యులరైజ్ చెయ్యాలని, రెగ్యులరైజ్ చేసే వరకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.ప్రసాద్, సూర్యనారాయణ, జి.బాలకృష్ణ, వై.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు


మెటల్ పరుపుపై ఇసుక వేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని చినబోగిలి-మక్కువ ఎండీఆర్ బీటీరోడ్డులో ఏర్పడిన గోతులను తామరఖండి సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం తాత్కాలికంగా పూడ్చారు. రోడ్డు కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు నిలిపివేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం పాడైంది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై సాక్షి పత్రికలో ఆదివారం ప్రచురితమైన వార్తకు స్థానికులు స్పందించారు. సర్పంచ్ సహకారంతో మెటల్, ఇసుక తెప్పించి రోడ్డు గోతులను పూడ్చారు.

విజన్ 2047 సాకారానికి కృషి చేయాలి


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: విజన్ 2047 సాకారానికి సుస్థిరత, నాలెడ్జ్ ఎకానమీ, ఆర్థికాభివృద్ధి సాధించటానికి కృషి చేయాలని ఏఎంఓ బి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించామని, ఇక్కడ విజేతలుగా నిలిచిన వారిరు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ.అప్పలనాయుడు, సమగ్ర శిక్ష అధికారులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి మృతికి సంతాపం


విజయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్‌రాయ్

పార్వతీపురం: గుజరాత్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ తల్లి చీకటి విజయలక్ష్మి సెప్టెంబర్ 22న స్వర్గస్తులయ్యారు. పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆమె పెదకర్మను నిర్వహించారు. విజయలక్ష్మి చిత్రపటం వద్ద కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ సుమలత పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సుప్రీం కోర్టు న్యాయమూర్తి జేకే మహేశ్వరీ, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు మంత్రుల జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ఫోన్ ద్వారా సంతాపం తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర, విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణచక్రవర్తి, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జువేనాడ్ అహమద్ మౌలానా, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు నర్సింగరావు, చంద్రశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, ఉత్తరాంధ్ర న్యాయవాదులు, ఏపీ హైకోర్టు న్యాయవాదులు విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక అడిషనల్ జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదర్‌రావు, బార్ కౌన్సిల్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమ్మ గొప్పతనాన్ని గజల్ శ్రీనివాస్ పాట రూపంలో వినిపించి పలువురి మన్ననలు పొందారు.


సంతాప సభలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

పరామర్శ


నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, తదితరులు

సాలూరు: అనారోగ్యంతో బాధిదపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పువ్వల నాగేశ్వరరావును విశాఖ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడులతో కలిసి సోమవారం పట్టణంలోని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గృహానికి చేరుకున్నారు. అక్కడ నుంచి వారంతా పువ్వల నాగేశ్వరరావు గృహానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య పరీక్షలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి విద్యానికేతన్ ఆవరణలో అక్టోబర్ 2న ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ రౌతు సరళకుమారి తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి విశాఖపట్నం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వైద్యపరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు రుసుం తీసుకోకుండా అన్ని కంటి తనిఖీలు నిర్వహించబడునని తెలిపారు. అయితే వారు ఈహెచ్ఎస్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. వివరాలకు 9441415128, 7702358809 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ పెంటయ్య, సంస్థ ఫౌండర్ గణేష్

సాలూరు: ఓజోన్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో సోమవారం గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ ఎం.పెంటయ్య, సంస్థ ఫౌండర్ గణేష్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ


గోదాంకు సీల్ వేయిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. గోదాంలకు వేసిన సీల్‌ను, గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది సమక్షంలో సీల్ వేయించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి

పార్వతీపురం టౌన్: బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బాల్య వివాహాలు, కిశోర వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నియంత్రణకు ప్రతీ బాలికను బడికి వెళ్లే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. బడి, కళాశాల మానివేసిన 15-18 సంవత్సరాల బాలికలతో బాలికా సమూహాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్నారు. బాలికా సమూహాలలో మహిళా పోలీసులు కూడా ఉండాలన్నారు. వారితో తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, నిర్వహిస్తే చట్టపరంగా తీసుకునే చర్యలు, శిక్షలు గూర్చి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతో అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: మహిళలు చైతన్యవంతులైతే ఆ ప్రాంతం, నియోజకవర్గం, రాష్ట్రం, దేశం అనుకున్న విధంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. పెద్దబండపల్లిలో పోషణ అంగన్‌వాడీ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. నేటి పిల్లలు రేపటి పౌరులని, వారు మంచి ఆరోగ్యంగా ఉంటే దేశం బాగుంటుందని అన్నారు. పిల్లలు పౌష్టికాహార లోపానికి గురికాకుండా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాయన్నారు. గత పాలనలో పాడైన పాలు, కోడిగుడ్లు పంపిణీ చేసిన రోజులు ఉన్నాయని, కూటమి ప్రభుత్వంలో పిల్లలు సంపూర్ణ ఎదుగుదలకు అవసరమైన ఆహారం అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలపై ఏడీకి వినతి


ఏడీ రమాజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: ఎంఈఓల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఏడీ రమాజ్యోతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓలకు సంబంధించిన సర్వీస్ అంశాలు, శాఖాపరంగా నిర్వహించాల్సిన సమావేశాలు, తదితర అంశాలపై తమ సంఘానికి సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇటీవల జరిగిన ఎంఈఓ-1 ఖాళీలలో ఎంఈఓలను పూర్తి అదనపు బాధ్యతలతో నియమించినప్పుడు కూడా నిబంధనలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా నియమించడం జరిగిందని, వీటిపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి డీఈఓ తమ సంఘంతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లి జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ దృష్టికి గిరిజనుల సమస్యలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏలో గిరిజన ప్రజలకు నష్టం జరుగుతున్న తీరు, పరిణామాలను రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఐటీడీఏ పాలకవర్గ సమావేశం, గ్రీవెన్స్ లేక పోవడంతో కనీసం గిరిజన సమస్యలు చర్చకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన ఐటీడీఏ నిధులు ఇతర పనులకు ఖర్చు చేస్తున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఆగస్టు 9 నుంచి ఐటీడీఏకు రెగ్యులర్ పీఓ లేరని, మేనేజర్, ఏఓ, ఇంజనీరింగ్ ఈఈ, ఇప్పుడు డీడీ, సూపరింటెండెంట్‌లు లేని పరిస్థితి దాపురించిందన్నారు. ఇలా ఐతే గిరిజన సంక్షేమం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ, సూపరింటెండెంట్, గిరిజన గురుకుల సూపరింటెండెంట్ లేకపోతే గిరిజన విద్యా సంస్థల పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని గతంలో లేఖ ద్వారా గవర్నర్‌ను కోరామని, త్వరలోనే నేరుగా కలిసి గిరిజన సమస్యలను ఆయనకు వివరిస్తామన్నారు.